సాక్షి నిర్మల్

మంగళవారం । 21 । నవంబర్ । 2023



ఎన్నికల పాఠం

2లో▸

విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం, ఓటుహక్కు విలువను తెలియజేసేందుకు ప్రభుత్వం పదోతరగతి సాంఘికశాస్త్రంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ' పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టింది.

నేడు ఉచిత గ్రహణ, మొర్రి స్క్రీనింగ్ క్యాంప్

నిర్మల్ రూరల్: ఈనెల 21న ఉచిత గ్రహణ, మొర్రి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. బసవతారకం స్మైల్ ట్రెన్ సెంటర్, ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో భైంసా మండల విద్యావనరుల కేంద్రంలో ఈ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభిస్తామని తెలిపారు. ఆరు నెలల వయసు నుంచి 50 ఏళ్లలోపు వారికి వైద్యులు చికిత్స అందిస్తారని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 / 19.1

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత సాధారణంగా నమోదవుతుంది. రాత్రి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మైక్రో అబ్జర్వర్స్ ప్రక్రియ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మైక్రో అబ్జర్వర్స్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సాధారణ పరిశీలకులు రవిరంజన్‌కుమార్ విక్రమ్, కె.గోపాలకృష్ణ, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ సమక్షంలో కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో ఎన్నికల మైక్రో అబ్జర్వర్స్ రాండమైజేషన్ సోమవారం నిర్వహించారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో నిర్మల్-47, ముథోల్-50, ఖానాపూర్-58 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే మైక్రో అబ్జర్వర్స్‌ను కేటాయించడం జరిగిందని వివరించారు. వీరికి త్వరలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్, ఈడీఎం నదీమ్, ఎన్ఐసీ ఇంజినీర్లు మణికంఠ, మీర్జా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ వాహనం తనిఖీ చేయాలి

చెక్‌పోస్ట్ వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎలాంటి మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కొండాపూర్ చెక్‌పోస్టును సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. స్వయంగా వాహనాలను తనిఖీ చేసి రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అనంతరం మంజు లాపూర్ ఎస్సీ కాలనీలో పంపిణీ చేస్తున్న ఓట రు స్లిప్పులను పరిశీలించి సంబంధిత బీఎల్‌వోలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తి చేయాల ని, ప్రతీ ఓటరుకు అందేలా చూడాలన్నారు. ఆ యన వెంట ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ సీవీ.రాజు, ఏఈవో, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జెడ్పీ సీఈవో



సూచనలిస్తున్న జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

తానూరు: మండలంలోని ఎల్వి, హంగిర్గా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్ సోమవారం పరిశీలించారు. మరుదొడ్లు, నీటి వసతితోపాటు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎంపీడీవో శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్వి పోలింగ్ కేంద్రంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు మరమ్మతు చేపట్టి నీటి వసతి కల్పించాలన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యాసంగి పంటలపై సమీక్ష

తానూరు: మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో యాసంగి పంటలపై జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ ఏఈవోలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. రైతులు వేసుకున్న పంటల వివరాలు తెలుసుకున్నారు. ఏఈవోలు పంటలను పరిశీలించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కోలూరు గ్రామంలో రైతులు వేసుకున్న శనగ పంటను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ మీనా, ఆయా గ్రామాల ఏఈవోలు పాల్గొన్నారు.

సమయం లేదు

- ఎన్నికల ప్రచారానికి ఇంకా ఏడురోజులే..
- వేగం పెంచుతున్న అభ్యర్థులు
- తెర వెనుక వ్యూహాలకూ పదును
- గెలుపే లక్ష్యంగా సర్వశక్తులు ఒడ్డుతున్న అభ్యర్థులు

మిత్రమా..



నిర్మల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా తొమ్మిది రోజులే గడువుంది. వారం రోజుల్లో ప్రచారం ముగియనుంది. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులు ఇప్పటి నుంచే కౌంట్‌డౌన్ మొదలు పెట్టారు. ఇన్ని రోజులు ఒకెత్తు.. ఈ వారం ఒకెత్తు అన్నట్లుగా అభ్యర్థులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రోజూ ప్రణాళికాబద్ధంగా విజయం కోసం ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయి.. ఎక్కడ ఎవరిని తమవైపు తిప్పుకోవాలో ప్లాన్ వేస్తున్నారు. ప్రత్యర్థుల వ్యూహాలను దెబ్బతీస్తూ విజయాన్ని అందుకునేలా ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. ప్రచారంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మూడూ పోటాపోటీగా దూసుకెళ్తున్నాయి. ఈ చివరివారంలో భారీసభలకూ ప్లాన్ చేసుకుంటున్నాయి.

ఈ వారమే కీలకం..

ఎన్నికల పర్వంలో కీలకమైన ప్రచారఘట్టానికి కేవలం వారమే మిగిలింది. ఈనెల 28న సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. ఈక్రమంలో జిల్లాలో అన్ని పార్టీలు తమ జోరును పెంచనున్నాయి. కొంతమంది అభ్యర్థులు ఈ వారంరోజులు కౌంట్‌డౌన్ పెట్టుకున్నారు. ఏరోజు ఏం చేయాలి.. ఎవరు ఏ బాధ్యత చేపట్టాలనే దాన్ని నిర్ణయించుకున్నారు. దీని ప్రకారమే రోజూ ఉదయం కౌంట్‌డౌన్-1 అంటూ ఆరోజు చేయాల్సిన పనులను వాట్సప్ ద్వారా పంపిస్తున్నారు. ప్రధానంగా బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రచారాన్ని పదునెక్కించే దిశగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడ వీక్ ఉన్నామనే సమాచారాన్ని ఇప్పటికే వివిధ వర్గాలు, ప్రత్యేక బృందాల ద్వారా తెలుసుకున్న అభ్యర్థులు వాటిపై దృష్టిపెట్టారు. ఈ వారంలో ఎంతగా ప్రజల్లోకి వెళ్తే.. ఎంతవరకు ఓటర్లను ఆకట్టుకోగలిగితే అంతగా విజయావకాశాలు పెరుగుతాయని అభ్యర్థులు భావిస్తున్నారు.

అనుక్షణం జనంతోనే..

ఎన్నికల్లో ఏ పార్టీ గెలువాలన్నది ఓటరు మాత్రమే డిసైడ్ చేస్తాడు. ఆయన మద్దతు ఉన్నవాళ్లే విజేతలవుతారు. అందుకే అభ్యర్థులు అనుక్షణం జనంలోనే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల రోజువారీ కార్యకలాపాలు ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమవుతున్నాయి. కొంతమంది అభ్యర్థులు రోజంతా ప్రచారం చేస్తూ రాత్రిళ్లు కీలక నేతలు, సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏ మండలంలో, ఏ గ్రామంలో తమకు అనుకూలంగా ఉన్నారు.. కాస్త ప్రయత్నిస్తే తమవైపు వచ్చేవారెవరు.. అని ఆరా తీస్తున్నారు. వారికి తగ్గట్లు తమ నుంచి ఏం కావాలో ఆ ఏర్పాట్లు చేస్తున్నారు.

గంపగుత్త ఓట్ల కోసం...

జిల్లాలోని అన్ని పార్టీల అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు వివిధ ప్రయత్నాలను చేస్తున్నారు. వారమే మిగలడంతో ఇక ఒకరిద్దరు ఓటర్లను కాకుండా ఒకేసారి వంద, రెండు వందలమంది ఓటర్లను గంపగుత్తగా తమవైపు తిప్పుకునే వ్యూహాలను రచిస్తున్నారు. ఇందుకు కావాల్సిన 'ఏర్పాట్లు' సిద్ధం చేసుకున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా కుల, ఉపాధ్యాయ, ఉద్యోగ, యువజన సంఘాలు, కమిటీలతో 'కీలక' చర్చలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు ప్రచారంలో పాల్గొంటుండగా, వారి అనుచరులు, నాయకులు గంపగుత్త ఓటర్లతో చర్చలు నిర్వహిస్తున్నారు. వారికి కావాల్సినవి సమకూరుస్తూ వారిని తమవైపు తిప్పుకునేందుకు శ్రమిస్తున్నారు.

పోటా పోటీ..

నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ఎప్పుడూ లేనంతగా నిర్మల్ నియోజకవర్గంలో ఇంద్రకరణ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీహరిరావుల మధ్య త్రిముఖపోరు తీవ్రమవుతోంది. ముథోల్‌లో విఠల్‌రెడ్డి, రామారావుపటేల్ మధ్య గట్టిపోటీ ఉండగా, నారాయణరావుపటేల్ సైతం గెలుపు కోసం శ్రమిస్తున్నారు. ఖానాపూర్‌లో భూక్య జాన్సన్ నాయక్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వెడ్మ బొజ్జుపటేల్ వేగంగా పుంజుకుంటుండగా, రమేశ్ రాథోడ్ తన సీనియారిటీని ఉపయోగిస్తున్నారు. మిగతా పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ శక్తిమేర ఓటరు ప్రసన్నానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

ఓట్ ఫ్రమ్ హోమ్..

- దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాట్లు
- 22, 23 ,24 తేదీల్లో ఇంటి నుంచే ఓటింగ్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్
- నియోజకవర్గాల వారీగా టీంలు ఏర్పాటు
- జిల్లాలో 468 మంది దరఖాస్తు



నిర్మల్‌చైన్‌గేట్: ఇంటి వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు ఈనెల 22, 23, 24 తేదీల్లో ఇంటి నుంచే ఓటు వేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, పోలీసు అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

ఇళ్ల వద్దకే అధికారులు..

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉంటుంది. రిటర్నింగ్ అధికారులు హోం ఓటింగ్ షెడ్యూల్ వివరాలను అభ్యర్థులకు తెలియజేయనున్నారు. అలాగే ఓటర్లకు ఇప్పటికే బీఎల్‌ఓలు సమాచారం అందజేశారు.

మూడు నియోజకవర్గాల్లో..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 7,23,389 మంది ఓటర్లు నమోదు కాగా.. ఇందులో 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు 21,312 మంది ఉన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో ఫారం 12డి ద్వారా 229 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 180 మంది మాత్రమే ఓటు హక్కు పొందారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఫారం 12డి ద్వారా 135 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 64 మంది మాత్రమే ఓటు హక్కు కల్పించారు. ముథోల్ నియోజకవర్గంలో ఫారం 12డి ద్వారా 224 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 224 మంది ఓటు హక్కు పొందారు.

రెండుసార్లు అవకాశం...

22వ తేదీన ఓటరు ఇంటికి ఎన్నికల అధికారులు వెళ్తారు. ఒక వేళ ఆ సమయంలో ఓటరు ఇంట్లో లేనిపక్షంలో తిరిగి 23న వస్తామని, ఇదే చివరి అవకాశం అని ఓటరుకు అధికారులు తెలియజేస్తారు. రెండోసారి వెళ్లినప్పుడు కూడా ఓటరు లేకపోతే అతను ఓటు వేసే అవకాశం కోల్పోతాడు.

రహస్య ఓటింగ్ విధానం...

ఇంటి వద్దనే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుంది. ఫారం 12డి ద్వారా దరఖాస్తు చేసుకున్న ఓటరు ఇంటికి ఎన్నికల సిబ్బంది మొబైల్ వాహనంలో చేరుకుని ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన చోట ఓటరు రహస్యంగా తన ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఇద్దరు పోలింగ్ అధికారులు, పోలీసు అధికారితోపాటు ఓ వీడియో గ్రాఫర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఓటరు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ప్రక్రియంతా వీడియో తీస్తారు.

వివరాలు:

నిర్మల్ నియోజకవర్గం	
వచ్చిన దరఖాస్తులు	229
వృద్ధులు	97
వికలాంగులు	132
అర్హులు	180
వృద్ధులు	91
వికలాంగులు	89
ముథోల్ నియోజకవర్గం	
వచ్చిన దరఖాస్తులు	224
వృద్ధులు	107
వికలాంగులు	117
అర్హులు	224
వృద్ధులు	107
వికలాంగులు	117
ఖానాపూర్ నియోజకవర్గం	
వచ్చిన దరఖాస్తులు	135
వృద్ధులు	54
వికలాంగులు	81
అర్హులు	64
వృద్ధులు	31
వికలాంగులు	33

ఏర్పాట్లు చేశాం..



ఈ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఫారం 12డి దరఖాస్తు ద్వారా పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 22 నుంచి ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. నిర్మల్ నియోజకవర్గంలో మూడు రోజులు అధికారుల టీంలు ఆయా మండలాల పరిధిలో తిరిగి పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు దారుల నుంచి స్వీకరిస్తారు.

– రత్న కళ్యాణి, నిర్మల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి

అక్కడే గెలుపు బాట!

- ప్రతీ నియోజకవర్గంలో ఒకే చోట అధిక ఓట్లు
- జిల్లా కేంద్రాలు, పట్టణాల్లోనే ఎక్కువ ఓటర్లు
- అక్కడే దృష్టి సారించి అభ్యర్థుల ప్రచారం
- గెలుపోటములను ప్రభావితం చేస్తున్న ప్రాంతాలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతీ శాసనసభ నియోజకవర్గంలో ఓట్ల పరంగా ఓ గుండెకాయ లాంటి ప్రాంతం ఉంది. అక్కడే అత్యధికంగా ఓటర్లు ఉండడంతో ప్రతీ ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తోంది. అభ్యర్థి గెలవడంలో ప్రతీ ఓటు ముఖ్యమే కానీ.. ఒక ప్రాంతంలోనే ఆ నియోజకవర్గ సగం ఓటర్లు అక్కడే ఉండడంతో అభ్యర్థులకు కీలకంగా మారుతోంది. అధిక ఓట్లు ఉన్న అలాంటి ప్రాంతాలపైనే ప్రత్యేక దృష్టి సారించి అన్ని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఒక అభ్యర్థి గెలిచేందుకు వచ్చే ఓట్లన్నీ ఒకే చోట ఉండడంతో ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. ఆ కారణంగా ఎక్కువగా రోడ్‌షోలు, సభ, సమావేశాలు, అగ్ర నాయకులతో ప్రచార సభలు ఓట్లు ఎక్కువగా ఉన్న చోట్లనే ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఉమ్మడి జిల్లా పరిధిలోని పది నియోజకవర్గాల్లో ఓట్లు అత్యధికంగా ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తే ఆ ప్రాంత ప్రాముఖ్యత తెలియజేస్తుంది.

ఆ ప్రాంతాల్లోనే అధికం

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు ఉన్న ప్రాంతాల్లో ఇక్కడే ఓట్లు అధికంగా ఉన్నాయి. ఉదాహరణకు మంచిర్యాల నియోజకవర్గం చూస్తే జిల్లా కేంద్రంలోనే దాదాపు 34శాతం ఓట్లు ఉన్నాయి. ఆ తర్వాత నస్పూర్ పట్టణంలో అధికంగా ఉన్నాయి. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, బోథ్, బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రాల్లోనే అత్యధికంగా ఓట్లు ఉన్నాయి. ఇక ముథోల్ పరిధిలో భైంసాలో, చెన్నూరు పరిధిలో మందమర్రి, సిర్పూర్‌లో కాగజ్‌నగర్, ఖానాపూర్‌లో ఉట్నూరులో మెజార్టీ ఓటర్లు ఉన్నారు. జనసాంద్రత అధికంగా ఉన్న చోట్లు, ఉద్యోగ, ఉపాధి కోసం స్థిరపడడంతో ప్రతీ నియోజకవర్గంలో 30 నుంచి 40శాతం ఓట్లు ఇక్కడే ఉన్నాయి. దీంతో రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, బహిరంగ సభలు ఎక్కువగా ఈ ప్రాంతాల్లోనే సాగుతున్నాయి. ఇక తక్కువ ఓట్లు ఉన్న ప్రాంతాలకు ఆ ఓట్లకు తగినట్లుగా సమయం కేటాయిస్తున్నారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులు, డిపాజిట్లు తెచ్చుకునేందుకు నియోజకవర్గం మొత్తం తిరగలేని అభ్యర్థులు కూడా ఎక్కువగానే ఈ ప్రాంతాలపైనే దృష్టి సారించారు.

నియోజకవర్గం	ఎక్కువ ఓట్లున్న ప్రాంతం	ఓట్లు(వేలల్లో)	మొత్తం ఓట్లు(లక్షల్లో)
ఆదిలాబాద్	ఆదిలాబాద్‌అర్బన్	97	2.40
సిర్పూర్	కాగజ్‌నగర్	93	2.26
మంచిర్యాల	మంచిర్యాల	92	2.74
నిర్మల్	నిర్మల్‌అర్బన్	85	2.53
ముథోల్	భైంసా	79	2.49
చెన్నూరు	మందమర్రి	75	1.88
బెల్లంపల్లి	బెల్లంపల్లి	63	1.73
ఖానాపూర్	ఉట్నూర్	48	2.20
ఆసిఫాబాద్	ఆసిఫాబాద్	44	2.26
బోథ్	బోథ్	36	2.08



యాసంగి పంటకు నీరు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కడెం నీటిని యాసంగి పంటకు విడుదల చేసే పరిస్థితి లేకుండా పోయిందని ప్రజా సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ డాకూర్ తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు గేటు తెగిపోవడంతో ప్రాజెక్టు ఖాళీ అయిందని తెలిపారు. రిపేరు సాకుతో యాసంగి పంటకు నీళ్లు వదిలే పరిస్థితి లేదన్నారు. నీరు ఇవ్వకపోతే సమారు 60 వేల ఎకరాలు బీళ్లుగా మారతాయని తెలిపారు. ప్రాజెక్టు గేటుకు మరమ్మతు చేసి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి జనవరిలో నీరు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.సత్యనారాయణ, చందుల సాయికిరణ్, కాతిలే లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయం చుట్టే ముథోల్ రాజకీయం..

- అభివృద్ధికి నోచుకోలేదని విమర్శలు
- సిరాల ప్రాజెక్టు తెగినా.. అతీగతి లేని దుస్థితి
- గుండెగాం పునరావాసంపై స్పష్టత కరువు
- ముథోల్ ఎన్నికల్లో ప్రధాన సమస్యలు

భైంసా/భైంసాటౌన్: ముథోల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారపర్వం జోరుగా సాగుతోంది. ముథోల్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేశామని అధికార పార్టీ చెబుతుండగా, ఎలాంటి అభివృద్ధి లేదని ప్రతిపక్ష పార్టీలు ఊరూరా ప్రచారం చేస్తున్నాయి. ముథోల్ నియోజకవర్గంలో బాసర సరస్వతి ఆలయం ప్రధానమైంది. దక్షిణ భారతదేశంలోనే ఏకైక సరస్వతి క్షేత్రంగా ఉన్న ఇక్కడికి దేశవ్యాప్తంగా అక్షరాభ్యాస పూజలు జరిపించేందుకు భక్తులు లక్షలాదిగా వస్తారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత యాదాద్రి, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు, భద్రాచలం ఇలా ప్రధాన ఆలయాల రూపురేఖలు మారిపోయాయి. కానీ, సరస్వతీ అమ్మవారి ఆలయం అలాగే ఉంది. రూ.50 కోట్లతో అభివృద్ధి చేశామని అధికార పక్షం చెబుతున్నా, అక్కడి సమస్యలు, భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రతీసారి జరిగే ఉత్సవాల్లో, ముఖ్య పర్వదినాల్లో స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. బాసర ఆలయం చుట్టే ముథోల్ రాజకీయం ఉంది.

- ఇక భారీ వర్షాలతో సిరాల ప్రాజెక్టు కొట్టుకుపోగా, 140 ఏళ్లుగా ఆయకట్టు కింద పంట పండించే రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రాజెక్టు ప్రధాన కట్ట తెగడంతో వందల ఎకరాలు నీట మునిగి బండరాళ్లు, ఇసుక మేటలతో ఆనవాళ్లు లేకుండా భూములు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు రూ.11 కోట్లతో పునర్మిస్తున్నట్లు అధికార పక్షం చెబుతున్నా రైతులు తీవ్రంగా నష్టపోయారని పాలకులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.
- కొన్నేళ్లుగా గుండెగాం పునరావాసంపై అక్కడి వారు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పునరావాసంపై స్పష్టమైన హామీ లేక ఇప్పటికీ గుండెగాం గ్రామస్తులు భైంసా పట్టణ సమీపంలోని కమలాపూర్ గుట్టకు ఆనుకుని నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లలోనే తాత్కాలికంగా నివాసముంటున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కింద ప్యాకేజీ మంజూరుతోపాటు సర్వే పూర్తయిందని అధికార పక్షం చెబుతుండగా, గుండెగాం సమస్యను పరిష్కరించడం లేదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.



వారంరోజులుగా ముథోల్ రాజకీయాలన్నీ మూడు ప్రధాన సమస్యల చుట్టూ తిరుగుతున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ముథోల్ బరిలో 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోరు కనిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పోటీ పడుతున్న అభ్యర్థులను కలిసి ప్రధాన సమస్యలపై మాట్లాడగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పుకొచ్చారు.

రూ.50 కోట్లతో ఆలయ అభివృద్ధి..

– జి విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి



బాసర సరస్వతి అమ్మవారి ఆలయానికి రూ.50కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి. వసతిగృహాల ఆధునీకరణ, రోడ్ల నిర్మాణం, ఆలయంలో పలు మార్పులు చేశాం. భైంసాలో ఇటీవలే జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో సీఎం కేసీఆర్ బాసర అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే రూ.వంద కోట్లతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. భారీ వర్షాలతో సిరాల ప్రాజెక్టు తెగిపోవడం రైతులు నష్టపోవడం జరిగింది. సిరాల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.11 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. సిరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇక గుండెగాం గ్రామ పునరావాసంపై ఆర్‌అండ్‌ఆర్ కింద నిధులు మంజూరయ్యాయి. రెవెన్యూ అధికారులు గ్రామంలో సర్వే చేపట్టారు. అక్కడి కుటుంబాలు, జనాభా వివరాలు సేకరించారు. ఆర్‌అండ్‌ఆర్ కింద పునరావాసం కల్పిస్తాం. ఇప్పటికే ఆ పనులు ప్రారంభమయ్యాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.

యాదాద్రిలా సరస్వతీ క్షేత్రం..

– పవార్ రామారావుపటేల్, బీజేపీ అభ్యర్థి



బాసర సరస్వతి ఆలయంతోనే ఈ ప్రాంతానికి పేరుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే సరస్వతి క్షేత్రాన్ని మరో యాదాద్రిలా తీర్చిదిద్దుతాం. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడి కేంద్ర నిధులతో బాసరను పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తాం. గత పాలకులు రూ.50 కోట్లు మంజూరు చేశామని చెబుతున్నా ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదు. ట్రిపుల్‌ఐటీకి యూజీసీ నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తాం. భారీ వర్షాలతో సిరాల ప్రాజెక్టు కొట్టుకుపోయినా, రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం స్పందించలేదు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తాం. ప్రాజెక్టును నిర్మించి భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. గుండెగాం సమస్యను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోంది. ఈ సమస్యను ఎప్పటికప్పుడు దాటేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు గుండెగాం సమస్యను తీవ్రంగా పరిగణించడం లేదు. అధి కారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తాం.

పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి..

– భోస్లే నారాయణ్‌రావుపటేల్, కాంగ్రెస్ అభ్యర్థి



ముథోల్ అభివృద్ధిని ప్రస్తుత పాలకులు తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. బాసర ఆలయంతోపాటు బాసర ట్రిపుల్ ఐటీని పట్టించుకున్న పాపాన పోలేదు. గుండెగాం ముంపు సమస్య పరిష్కారంలో జాప్యం చేస్తూనే ఉన్నారు. సిరాల ప్రాజెక్టు తెగి రైతులు నష్టపోతే పరిహారం హామీ కూడా ఇవ్వలేదు. ఎమ్మెల్యేగా ముథోల్‌లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాను. ఈసారి అధికారంలోకి వస్తే బాసర ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం. ట్రిపుల్ ఐటీకి నిధులు విరివిగా కేటాయించాం. బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయింపును తగ్గించేసింది. ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం. గుండెగాం ముంపు సమస్య పరిష్కారం కోసం పునరావాసం ప్యాకేజీ త్వరితగతిన మంజూరు చేయిస్తాం.

క్లుప్తంగా

బావిలోపడి వ్యక్తి మృతి


రాజలింగు (ఫైల్)

జన్నారం: ప్రమాదవశాత్తు బావిలోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన జువ్వాడి చిన్న రాజలింగు (48) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 17న ఇంట్లోనుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం గ్రామానికి చెందిన ముజ్జన్న గ్రామ సమీపంలోని తన పత్తిచేనులో నీరు పెట్టేందుకు వెళ్లగా బావిలో మృతదేహం తేలియాడుతోంది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

నస్పూర్(మంచిర్యాల): పట్టణ పరిధిలోని జాతీయ రహదారి 363 బైపాస్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రవికుమార్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కాసిపేట మండలం సోమగూడెం లంబాడితండాకు చెందిన బోడ శంకర్ (35) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జైపూర్‌లోని గురుకుల ఎస్సీ హాస్టల్‌లో చదువుకుంటున్న తన కుమారుడిని సోమవారం ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి హాస్టల్‌లో దింపి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారిపై సీహెచ్‌పీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని బంధువు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏరియాస్పత్రిలో నవజాత శిశువు మృతి

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి ఓ నవజాత శిశువు మృతి చెందింది. లోకేశ్వరం మండలం నగర్‌కు చెందిన రజిత ప్రసవం కోసం ఆదివారం మధ్యాహ్నం ఆస్పత్రికి రాగా వైద్యులు సహజ ప్రసవం కోసం ప్రయత్నించారు. రాత్రి 11 గంటల సమయంలో నొప్పులు తీవ్రం కావడంతో ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. అనంతరం శిశువు మృతిచెందినట్లుగా తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపించారు. ఈ విషయమై సూపరింటెండెంట్ కాశీనాథ్‌ను వివరణ కోరగా గర్భిణికి ఫిట్స్ రావడంతో పాటు శిశువు మెడకు పేగు చుట్టుకుని ఉండడంతో మృతి చెందినట్లు తెలిపాడు.

కారు ఢీకొని ఒకరి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో ని కేసీబీ గార్డెన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో రాంనగర్ కాలనీలో జాతీయ రహదారిపై ఈ నెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల మండలంలోని బట్టిసావర్‌గాం గ్రామానికి చెందిన నరేందర్ ఆదిలాబాద్ వైపు నుంచి కేసీబీ గార్డెన్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. కారు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. నరేందర్ బంధువైన చంటి రవి సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పాఠ్యపుస్తకంలో ఎన్నికల పాఠం

- పదో తరగతి సోషల్ పుస్తకంలో పాఠ్యాంశం
- విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్యంపై అవగాహన

జంగ్ తెలంగాణ

నిర్మల్ ఖిల్లా: విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం, ఓటుహక్కు విలువను తెలియజేసేందుకు ప్రభుత్వం పదోతరగతి సాంఘిక శాస్త్రంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ' పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఎన్నికల సమయంలోనే ఈ పాఠ్యాంశం సిలబస్‌లో ఉండడం విశేషం. ఇందులో ఎన్నికల వ్యవస్థ నుంచి ఓటుహక్కు వినియోగం వరకు విద్యార్థులు సులభతరంగా అర్థం చేసుకునేలా పాఠ్యాంశంలో రూపొందించారు. ప్రజాస్వామ్యదేశంలో ఎన్నికల అవసరాన్ని గుర్తించి 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడిందని, ఇది స్వయం ప్రతిపత్తి సంస్థ అని వివరించారు. 1952లో నిర్వహించిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో 17.32 కోట్లమంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 67 కోట్లు దాటిందని, ఎన్నికల నిర్వహణకు సివిల్ సర్వీస్‌లకు చెందినవారు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉంటారని పాఠ్యాంశంలో పేర్కొన్నారు. దీంతోపాటు ఎన్నికల సంఘం దేశంలో సుమారు 45 లక్షల మంది సిబ్బందితో భారీ ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తోందని విద్యార్థులకు ఈ పాఠ్యాంశం ద్వారా తెలియజేశారు.

కమిషన్ విధులు..

ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం ప్రధాన పాత్ర పోషిస్తుంది. గతంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా పనిచేసిన టీఎన్ శేషన్ ప్రజల అభిమానాన్ని చూరగొన్న తీరును వివరించారు. రాజ్యాంగంలోని 15వ భాగంలోని ఆర్టికల్ 324 నుంచి 329 వరకు ఎన్నికల సంఘం నిర్మాణం, విధులను వివరించారు. ఓటర్ల జాబితాను రూపొందించడం మొదలు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ తేదీల ఖరారు, ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పాటించాల్సిన నియమావళిని పొందుపర్చారు.


పదోతరగతిలో ఎన్నికలపై పాఠ్యాంశం

ప్రవర్తన నియమావళి

అభ్యర్థుల ప్రవర్తనా నియమావళికి సంబంధించి 11అంశాలను ఇందులో పొందుపర్చారు. రాజకీయ పార్టీ ఏవిధంగా గుర్తింపు పొందుతుంది.. ఇందుకోసం ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలనే అంశాలను వివరించారు. ఎన్నికల సంఘం గుర్తులను ఎలా కేటాయిస్తుంది. ఓట్ల శాతం ఆధారంగా ఒక పార్టీని జాతీయ, ప్రాంతీయ పార్టీగా ఎలా గుర్తిస్తారో వివరించారు. పార్టీల ప్రచార సమయం, నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలను పాఠ్యాంశంలో పొందుపర్చారు.

విధులు..

ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్‌రోజున అధికారులు, ఏజెంట్ల విధులను వివరించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి. రాజకీయపార్టీలు, ఓటర్లు ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి సహకరించడం, పోలింగ్‌రోజు ఏ అధికారి ఏ విధులు నిర్వర్తిస్తారో తెలియజేశారు.

టీఎన్ శేషన్ సిఫార్సులు

భారత ఎన్నికల కమిషనర్‌గా 1990 నుంచి 1996 వరకు పనిచేసిన టీఎన్ శేషన్ ఎన్నికల నిర్వహణలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. వాటిని ఈ పాఠ్యాంశంలో పొందుపర్చారు.

- ఎన్నికల ప్రచార సమయాన్ని నామినేషన్ ఉపసంహరించుకునేందుకు నిర్ణయించిన తేదీ నుంచి 14 రోజులుగా నిర్ణయించారు.
- ఒక అభ్యర్థి ఒకేసారి రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి పోటీ చేయరాదు.
- ఒక వ్యక్తి ఏదైనా నేరంలో కనీసం రెండేళ్ల జైలు శిక్ష అనుభవిస్తే ఆరేళ్లపాటు పోటీకి అనర్హులు.
- పోటీలో ఉన్న అభ్యర్థి మరణిస్తే ఎన్నిక వాయిదా వేయాలి. కానీ రద్దు చేయరాదు.
- ప్రచారం పూర్తయిన తర్వాత 48 గంటల వరకు మద్యం అమ్మకాలు నిషేధించాలి.

ఉపాధ్యాయులు అన్ని విషయాలు వివరించారు



ప్రజాస్వామ్యంలో సుపరిపాలన అందించే వ్యక్తులను ఎన్నుకుంటేనే అభివృద్ధి జరుగుతుందని తెలిసింది. పాఠంలోని వివరాల ఆధారంగా మా ఉపాధ్యాయులు అన్ని విషయాలు వివరించారు. దీంతో ఓటు వేయడం ఎంత తప్పనిసరో మా అమ్మానాన్నకు చెప్పా. – అభిరాజ్, పదోతరగతి, జెడ్పీహెచ్‌ఎస్, మల్లాపూర్

మంచి నిర్ణయం



పదో తరగతి సాంఘిక శాస్త్రంలో ఎన్నికల ప్రక్రియపై పాఠ్యాంశాన్ని ముద్రించడం అభినందనీయం. తద్వారా విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన కల్పించడం సాధ్యమవుతుంది. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఈ పాఠం బోధిస్తే విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. – అరిగెల వెంకటరమణ, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, మల్లాపూర్, లక్ష్మణచాంద, నిర్మల్

ఉమ్మడి జిల్లాలో 3,741 బ్యాలెట్ యూనిట్ల వినియోగం

- ఏడు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి..
- మూడు చోట్ల రెండేసి..

చెన్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో 3,741 బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. పది నియోజకవర్గాలు ఉండగా.. ఏడు చోట్ల ఒక్కో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేస్తుండగా.. మూడు చోట్ల 16మంది కంటే ఎక్కువగా అభ్యర్థులు బరిలో ఉండడంతో ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండేసి బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఖరారు

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఖరారు చేసింది. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆసిఫాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కళాశాల, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రం, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రం టెక్నికల్, ట్రెనింగ్ సెంటర్(టీటీడీసీ) ఆదిలాబాద్‌లో, ఖానాపూర్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రం నిర్మల్‌లోని పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలు, అభ్యర్థులు, బ్యాలెట్ యూనిట్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	అభ్యర్థులు+నోటా	ఒక్కో పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ యూనిట్లు	నియోజకవర్గంలో బ్యాలెట్ యూనిట్లు
సిర్పూర్	294	13+1	1	294
చెన్నూర్	227	14+1	1	227
బెల్లంపల్లి	227	13+1	1	227
మంచిర్యాల	289	17+1	2	578
ఆసిఫాబాద్	305	17+1	2	610
ఖానాపూర్	305	11+1	1	305
ఆదిలాబాద్	290	25+1	2	580
బోథ్	302	10+1	1	302
నిర్మల్	306	13+1	1	306
ముధోల్	312	10+1	1	312

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది


సన్మానం చేస్తున్న కుటుంబ సభ్యులు

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన బ్యాగును తిరిగి అప్పగించిన సిబ్బంది నిజాయతీ చాటుకున్నారు. పట్టణానికి చెందిన సాధిక్ కుటుంబ సభ్యులు ఆదివారం కరీంనగర్ బస్టాండులో ఆదిలాబాద్‌వైపు వెళ్లే బస్సు ఎక్కారు. లక్సెట్టిపేటలో బస్సు దిగి బ్యాగు అందులోనే మర్చిపోయారు. ఇంటికి వెళ్లి చూసేసరికి బ్యాగు లేకపోవడంతో వెంటనే బస్టాండుకు వచ్చి ట్రాఫిక్ గైడ్ రవీందర్‌కు విషయం తెలిపారు. అతను వెంటనే బస్సు డ్రైవర్ మిట్టల్, కండక్టర్ విట్టల్‌కు ఫోన్ చేయడంతో బ్యాగు బస్సులోనే ఉన్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆర్టీసీ సిబ్బంది బ్యాగును బాధితులకు అప్పగించారు. బ్యాగులో బంగారం, నగదు ఉన్నట్లు సాధిక్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బ్యాగు అప్పగించిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు.

ఎన్నికల అంశాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, ఆర్వో రాహుల్

బెల్లంపల్లి: ఎన్నికల ప్రతీ అంశంపై సెక్టోరల్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధులను సెక్టోరల్ అధికారులు తెలుసుకుని ఉండాలని అన్నారు. ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి పొరపాట్లకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే సౌకర్యాలపై సెక్టోరల్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, లైట్లు, ఫ్యాన్లు, దివ్యాంగులు, వయోవృద్ధులు, వికలాంగులు, గర్భిణుల కోసం ర్యాంపుల ఏర్పాటు, తాగునీరు, మూత్రశాలల ఏర్పాట్లపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి చర్యలపై అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై నమూనా యంత్రాల ద్వారా సెక్టోరల్ అధికారులకు అవగాహన కల్పించారు.

'మతోన్మాద ఫాసిస్టు పార్టీలను ఓడించండి'


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నియంత్రత్వ, మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంలను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్ అన్నారు. నియంత్రత్వ, మతోన్మాద ఫాసిస్టు పార్టీలను ఓడించాలంటూ రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్ పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలోని కుమ్రంభీమ్ భవన్ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరిగే ఎన్నికలు ప్రజల చేతిలో ఒక వజ్రాయుధం లాంటివని అన్నారు. కేసీఆర్ రెండు దఫాలుగా గెలిచినా ప్రజలకు ఒరిగింది ఏమిలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ సంఘాలు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కుమ్ర అశోక్, ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాండేకర్ వామన్, కొడప సురేశ్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూజాతాయి, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షులు రాజు, నితిన్, నాయకులు రాథోడ్ వామన్, అయ్యు పటేల్, బుచ్చిరాం, వినోద్ పాల్గొన్నారు.

'తుమ్మల'కు జాతీయ సాహితీ పురస్కారం


తుమ్మల దేవరావుకు పురస్కారం అందిస్తున్న గోరటి వెంకన్న

నిర్మల్‌ఖిల్లా: జాతీయ స్థాయిలో సాహిత్య రంగంలో కృషి చేస్తున్న వారికిచ్చే 'విమల సాహి తీ సాహిత్య పురస్కారం' నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు, ఉపాధ్యాయుడు డాక్టర్ తుమ్మల దేవరావు అందుకున్నాడు. సోమవారం హైదరా బాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లోని దొడ్డి కొమురయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి, తెలంగాణ శాసన మండలి సభ్యులు గోరేటి వెంకన్న, రిటైర్డ్ వైస్ చాన్సలర్, ప్రముఖ రచయిత డా.కొలుకలూరి ఇనాక్, ప్రముఖ అనువాదకుడు ప్రొ. జీవీ.రత్నాకర్, ప్రముఖ కవి, వక్త డాక్టర్ కోయి కోటేశ్వరరావు, కళాశ్రేష్ఠ బిక్కి కృష్ణ, ప్రముఖ కవి, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జెల్ది విద్యాధర్, ప్రముఖ కవి డాక్టర్ దేవయ్య (కర్ణాటక) తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పురస్కార గ్రహీతల రచనలు ఇతర భాషల సాహిత్యంతో పోల్చలేనంత ఉన్నతంగా ఉన్నాయని కొనియాడారు. అయితే తుమ్మల దేవరావు గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు అందుకున్నారు. అనేక పరిశోధనా వ్యాసాలు రచించారు. కచ్చురం, గడ్డిపూలు, మట్టిపాదాలు, నిర్మల్ జిల్లా సాహిత్య చరిత్ర, నిర్మల్ కథలు తదితర పుస్తకాలు వెలువరించాడు. ఈ సందర్భంగా వీరిని నిర్మల్ సాహితీ మిత్రులు వైద్యుడు డాక్టర్ చక్రధారి, డాక్టర్ దామెర రాములు, పత్తి శివప్రసాద్, నేరెళ్ల హన్మంతు, రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు.

'బీఆర్‌ఎస్‌కు ట్రస్మా మద్దతు'


మాట్లాడుతున్న శేఖర్‌రావు

జన్నారం(ఖానాపూర్): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ట్రస్మా పూర్తి మద్దతు ఇస్తుందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. సోమవారం కలమడుగులో విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, వివిధ సమస్యల పరిష్కారానికి పార్టీ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఖానాపూర్ నియోజక వర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు తమవంతు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో 65 ప్రైవేట్ పాఠశాలలు, వెయ్యికి పైగా ఉపాధ్యాయులున్నారని, వారందర్నీ కలిసినట్లు తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం రాత్రి 10గంటల అనంతరం దుకాణాలు తెరిచి ఉంచిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేశామని, ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

నగదు పట్టివేత


నగదు చూపుతున్న పోలీసులు

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ సమీపంలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో నగదు పట్టుబడినట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి గ్రామానికి చెందిన సాత్పతి రాజశేఖర్ మహారాష్ట్రలోని రాజూరా నుంచి వేమనపల్లికి ఎలాంటి ధృవపత్రాలు లేకుండా రూ.1,64,150 నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు

మందమర్రిరూరల్(చెన్నూర్): సీఐటీయూ పోరాట ఫలితంగానే సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సోమవారం సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరిపచౌరి పాస్ పుస్తకాలు పంపిణీ చేశారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.మధు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు వారికి సంబంధించిన పుస్తకాలను గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయానికి వెళ్లి తీసుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ... పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురుని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.11050 నగదును స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు బాలికల అదృశ్యం

నిర్మల్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని అదృశ్యం కేసు నమోదైనట్లు పట్టణ ఎస్సై సుమలత తెలిపారు. వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలానికి చెందిన విద్యార్థిని పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

నిర్మల్‌రూరల్: మండలంలోని లంగాడాపూర్ గ్రామానికి చెందిన రనావత్ దిబోరా అనే బాలిక అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలిక కుటుంబ సభ్యులు గ్రామంలో ఉంటూ జిల్లా కేంద్రంలో తిరుగుతూ బుగ్గలు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులు ఫోన్ ఎక్కువగా చూస్తున్నావని కూతుర్ని మందలించడంతో సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కానరాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఇద్దరు బాలికల అదృశ్యం

భైంసాటౌన్: భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు వారి కుటుంబీకులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన సాదుల గంగోత్రి(8), సాదుల దీప(10) సోమవారం మధ్యాహ్నం భైంసా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతానికి వెళ్లి తప్పిపోయారు. వారి తండ్రులు లక్ష్మినారాయణ, సంపూర్ణం ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చినట్లు వెల్లడించారు.

గుడుంబా పట్టివేత

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ తండా కొట్టమద్దిపడగ, గంగాపూర్ గ్రామంలోని కు టుంబ స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ అధి కారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ పేర్కొన్నారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది ముత్యం, సాయి, హరీష్, నరేందర్ ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని సిద్దాపూర్ వాగులో సోమవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్సై జ్యోతి వివరాల ప్రకారం... వాగు పైనుంచి వెళ్తున్న వారికి నీటిపై మృతదేహం కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాలర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు లక్మన్(15) స్థానిక సోఫినగర్‌కు చెందినవాడిగా గుర్తించారు. ఆదివారం తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై తెలిపాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చౌహాన్ విఠల్ (52) రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై జీవి రమణారెడ్డి వివరాల ప్రకారం .. విఠల్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఫైనాన్స్ తీసుకొని ఆటోను కొనుగోలు చేశాడు. తిరిగి డబ్బులు చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. విఠల్‌కు భార్య శోభతాయి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాంద-టి శివారు ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని చినఅర్లి గ్రామానికి చెందిన అల్లూరి గణేష్ రెడ్డి (47) ఆదిలాబాద్ నుంచి తన గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో చాందా-టి మైనార్టీ స్కూల్ ఎదురుగా వస్తున్న ఓ వాహనం ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. దీనిపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

ఒకరికి తీవ్రగాయాలు

కోటపల్లి(చెన్నూర్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బోరంపల్లికి చెందిన ఇందుల రాజన్న సోమవారం పరకాల నుంచి చెన్నూర్‌కు వస్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అందించి చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది శహబాజ్, పైలెట్ సతీశ్ తెలిపారు.

అంత్యక్రియలకు ముందుకు..


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పేదరికంతో అంత్యక్రియలు చేయలేని ఓ కుటుంబానికి బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ మానవత్వంతో ముందుకొచ్చింది. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన దుబ్బాక లక్ష్మి అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబీకులు ఆ స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకు రావడంతో ఆ సంఘం అధ్యక్షుడు అజీజ్ అంత్యక్రియల కోసం ఏర్పాటు చేశాడు. హిందు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అత్యాచారం ఘటనలో ఒకరికి పదేళ్ల జైలు

చింతలమానెపల్లి(సిర్పూర్): మహిళపై అత్యాచారం ఘటనలో రుద్రాపూర్ గ్రామానికి చెందిన దుర్గం తేజస్‌కు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ సోమవారం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి రమేశ్ తీర్పునిచ్చారు. లైజనింగ్ అధికారి కె.సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ అధికారి బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన అత్యాచార ఘటనలో పోలీసులు దుర్గం తేజస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో నిందితుడికి 376(2), 417, 420 ఐపీసీ సెక్షన్ల కింద జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధించారు.

డ్రైవర్‌పై పలువురి దాడి

ఆదిలాబాద్‌టౌన్: స్పిన్నింగ్ మిల్లు వాహన డ్రైవర్‌పై పలువురు దాడి చేసిన ఘటన ఆదివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే కార్మికులను రాత్రి పూట ఇంటికి వదిలిపెట్టే క్రమంలో డ్రైవర్ షేక్ సమీర్ వాహనంలో తాటిగూడకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో క్రాంతినగర్ ఆటో స్టాండ్ వద్ద షేక్ సల్మాన్, సోయల్ ఖాన్, వజీర్, వినోద్ వాహనాన్ని అడ్డుకున్నారు. డ్రైవర్‌ను కిందికి దింపి తాము ఎప్పుడు కనబడితే అప్పుడు నమస్తే పెట్టాలని బెదిరించి డ్రైవర్‌పై దాడి చేశారు. దీంతో ఖానాపూర్‌కు చెందిన డ్రైవర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఇంట్లో చోరీ

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని మస్తాన్ దుబ్బ దోభీకాలనీలో భైంసా కోర్టులో పనిచేస్తున్న గంగయ్య నివాసం ఉంటున్నాడు. అతడి భార్యకు ఆరోగ్యం బాగా లేక హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం శనివారం వెళ్లాడు. ఆదివారం రాత్రి దొంగలు తాళాన్ని పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోని ఎనిమిది తులాల బంగారు నగలు, 20తులాల వెండి, రూ.20వేల నగదు దోచుకెళ్లారు. సోమవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో భుజంగ్‌రావు

బాన్సువాడ రూరల్: ఓటు హక్కు దేశ సంక్షేమాభివృద్ధికి పునాది వంటిందని, ఓటును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావు అన్నారు. సోమవారం శ్రీరామ్ నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. దేశం, రాష్ట్రం, జిల్లా అభివృద్ధి పథంలో సాగి మనకు సుపరిపాలన అందాలంటే మంచి లక్షణాలున్న అభ్యర్థిని ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవాలన్నారు. అనంతరం ఇటీవల ఓటుహక్కుపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో–ఆర్డినేటర్ శైలి బెల్లాల్, కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించండి

బాన్సువాడ: బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కుమార్తె అరుణావెంకట్‌రెడ్డి, కోడలు సోనీరెడ్డి ప్రచారం చేశారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవోఎస్ కాలనీ, చైతన్యకాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల కోసం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రమాదేవి, అనిత, ప్రతిమారెడ్డి తదితరులున్నారు.



ప్రచారం చేస్తున్న పోచారం కుమార్తె, కోడలు

బాన్సువాడ గడ్డ.. పోచారం అడ్డా

- ఎనిమిదోసారి ఎన్నికల బరిలో..
- ఒకేసారి ఓటమి

బాన్సువాడ: సీనియర్ నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీలో ప్రత్యేక స్థానం ఉంది. బాన్సువాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎనిమిదో సారి నామినేషన్ వేశారు. తన రాజకీయ జీవితంలో 1994, 1999, 2009లో టీడీపీ తరఫున మూడు సార్లు, 2011 ఉప ఎన్నిక, 2014, 2018లో బీఆర్‌ఎస్ పార్టీ తరుపున వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించారు. 2004 ఎన్నికల్లో పెద్దాయనపై ప్రజల్లో సానుభూతి ఉన్నా అప్పుడు కాంగ్రెస్, వైఎస్ఆర్ హవా కారణంగా ఓటమిపాలయ్యారు. ఈసారి పోటీలో గెలిచి రికార్డు సొంతం చేసుకోవాలని భావిస్తున్నారు.

టీడీపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల హయాంలో సుముచిత స్థానం

1952లో బాన్సువాడ నియోజకవర్గం ఏర్పాటు నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవరికీ మంత్రి పదవులు దక్కలేదు. కానీ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి 1999 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కీలక మంత్రి పదవులు వరించాయి. టీడీపీ హయాంలో గృహ నిర్మాణ శాఖ, గనులు భూగర్భ శాఖ, పంచాయితీ రాజ్ శాఖల మంత్రిగా కొనసాగారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి పదవి లభించింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న రోజుల్లోనే రైతు బంధు, రైతు బీమా పథకాలు పురుడుపోసుకున్నాయి. దీంతో అప్పటి నుంచి పోచారంకు సీఎం కేసీఆర్ లక్ష్మీ పుత్రుడిగా పేరు పెట్టారు.



పోచారం శ్రీనివాస్‌రెడ్డి(బీఆర్‌ఎస్ అభ్యర్థి)

కార్యకర్త స్థాయి నుంచి..

బాన్సువాడ మండలం పోచారం గ్రామానికి చెందిన పరిగె రాజిరెడ్డి–పాపమ్మల పెద్ద కుమారుడైన పరిగె శ్రీనివాస్‌రెడ్డి సాధారణ రైతు కుటుంబంలో పుట్టి పక్క గ్రామమైన ఇబ్రహీంపేట్, బాన్సువాడ, హైదరాబాద్‌లో విద్యనభ్యసించారు. హైదరాబాద్ కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే కళాశాల ప్రెసిడెంట్‌గా చేశారు. అప్పట్లోనే బీటెక్ చదువుకున్నారు. 1990లో టీడీపీలో చేరి దేశాయిపేట్ సహకార సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వరుసగా రెండు సార్లు ఒకే సహకార సంఘం నుంచి అధ్యక్షులుగా గెలిస్తే సమితి అధ్యక్షులుగా పోటీ చేసేందుకు వీలుండదని, బాన్సువాడ మండలం బుడ్మి సహకార సంఘం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. దీంతో నిజామాబాద్ జిల్లా సహకార సంఘం చైర్మన్‌కు పోటీ చేశారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ సహకారంతో డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి నేడు రాష్ట్ర స్థాయిలో కీలక పదవి వరకు ఎదిగారు.

1994లో తొలి విజయం..

1994 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీనాదేవిపై విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కిషన్ సింగ్‌పై భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2004లో అనుహ్యంగా ఆర్మూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను అధిష్టానం బాన్సువాడకు పంపిస్తే రాష్ట్రవ్యాప్తంగా టీడీపీపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా పోచారం స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై భారీ మెజార్టీతో విజయఢంకా మోగించారు. తర్వాత తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పదవికి, టీడీపీకి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై విజయం సాధించారు. తర్వాత 2014లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కాసుల బాల్‌రాజ్‌పై విజయం సాధించారు. అలాగే 2018లో అదే కాంగ్రెస్ అభ్యర్థి కాసుల బాల్‌రాజ్‌పై రెండో సారి పోచారం గెలుపొందారు. రాజకీయ అనుభవం కలిగిన పోచారంకు సీఎం కేసీఆర్ స్పీకర్ పదవి ఇచ్చి రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వని నిధులు, డబుల్ బెడ్ రూం ఇళ్లు బాన్సువాడకు ఇచ్చి పెద్దాయనకు గౌరవం ఇచ్చారు. తన రాజకీయ జీవితంలో మచ్చ లేని నాయకుడిగా పోచారం పేరు తెచ్చుకున్నారు. నిస్వార్థ రాజకీయాలకు తెరలేపారు. ఏ ఊరికి వెళ్లినా ఆ ఊళ్లో చాలా మందిని పేరుపెట్టి పిలిచే అంతటి జ్ఞాపకశక్తి పెద్దాయన ప్రత్యేకత. బాన్సువాడ అంటేనే పోచారం అడ్డా అనే విధంగా రాష్ట్ర స్థాయిలో బాన్సువాడ పేరును నిలబెట్టారు.

భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం

- కంఠేశ్వర్ ఆలయంలో లక్ష దీపోత్సవము
- మారుమోగ్రిన శివ నామస్మరాలు
- దీపం వెలిగించిన ఎమ్మెల్సీ కవిత





నీల కంఠేశ్వరాలయంలో నిపోత్సవంలో పాల్గొన్న మహిళలు





నిజామాబాద్ సిటీ: కార్తీక మాసం తొలి సోమవారం కావటంతో ఉదయం 4 నుంచి ఆలయానికి భక్తుల తాకిడి మొదలైయ్యింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వేలాది సంఖ్యలో మహిళలు వెలిగించిన దీపాలతో అడుగువేసే అవకాశం లేకుండా పోయింది.

భారత్ జాగృతి ఆధ్వర్యంలో లక్ష దీపోవత్సం

భారత్ జాగృతి నిజామాబాద్ శాఖ, తెలంగాణ బ్రహ్మణ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ నీలకంఠేశ్వర్ ఆలయంలో లక్ష దీపోత్సవము కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ కవిత ఈ కార్యక్రమానికి హజరై కోనేరు వద్ద దీపం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కోనేరు చుట్టూ దీపాలు వెలిగించటంతో ఆ ప్రాంతమంతా కాంతులు వెదజల్లాయి. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ నిజామాబాద్‌లో శ్రీ నీలకంఠేశ్వర్ ఆలయంలో కార్తీక దీపోవత్సంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఈ ఆలయానికి వచ్చి కార్తీకమాసంలో ఇక్కడ దీపాలు వెలిగించటం సంతోషంగా ఉంది. నీలకంఠేశ్వర్ స్వామికి కార్తీక మాసానికి మాకు ఎన్నోయేండ్ల నుంచి అనుబంధం ఉందన్నారు. కార్తీక మాసం సందర్భంగా అందరికి శుభం కలుగాలని కవిత అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, జాగృతి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ భరద్వాజ్, జిల్లా అధ్యక్షుడు అవంతిరావు, బ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్, కోశాధికారి సురేష్ శర్మ, రమేష్‌కులకర్ణి, ఇందల్‌వాయి జడ్పీటీసీ గడ్డం సుమనారెడ్డి, జాగృతి మహిళ జిల్లా అధ్యక్షురాలు అపర్ణ, సభ్యులు రేఖా, సందీప్ తదితరులు పాల్నొన్నారు.

బిగాల కుటుంబ సభ్యుల ప్రచారం



గంగాస్థాన్‌లో ప్రచారం చేస్తున్న బిగాల గణేశ్‌గుప్తా సోదరీమణులు

నిజామాబాద్‌నాగారం: ఖలీల్‌వాడిలోని వెంకటసాయి అపార్టమెంట్, కేసీపీ, నీలకంఠేశ్వర అపార్ట్‌మెంట్‌లో సోమవారం బీఆర్‌ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా సతీమణి లత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకి ఓటు వేసి గణేష్ బిగాలను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. అలాగే గంగస్థాన్ పృథ్వీ వసంత్ ప్రెస్టీజ్ పార్క్ అపార్ట్‌మెంట్, అశోక టౌన్‌షిప్‌లో బిగాల గణేష్ గుప్తా సోదరీమణులు వాణి, రాణిలు ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, గణేశ్‌గుప్తాను గెలిపించాలని కోరారు. జగత్‌రెడ్డి, కెప్టెన్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, క్రిష్ణరెడ్డి, బలుసు వెంకటేష్, విజయ్, అమర్, చామకూర విశాలినిరెడ్డి, గరిపల్లి చంద్రబాగా, బిగాల జయ, బిగాల గౌతమి, కవిత, విజేత, సౌమ్య, సంగీత పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా సతీమణి లత

లక్షలు వెచ్చించారు..
లక్షణంగా వదిలేశారు!

- టీబీ కార్యాలయంలో మూలనపడ్డ నూతన ఎక్స్‌రే మిషన్
- మూడేళ్లవుతున్నా నో ఇన్‌స్టాలేషన్
- డిప్యూటేషన్‌పై టెక్నీషియన్
- రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోని నూతన ఎక్స్‌రే యంత్రం



రిమ్స్‌లో ఎక్స్‌రే, స్కానింగ్ కోసం బారులు తీరిన రోగులు



ఆదిలాబాద్‌లోని టీబీ కార్యాలయం

రేడియోగ్రాఫర్ డిప్యూటేషన్‌పై ఉన్నారు

టీబీ కార్యాలయానికి కేటాయించిన రేడియోగ్రాఫర్ ఏడాదికి పైగా డిప్యూటేషన్‌పై ఉన్నారు. ప్రస్తుతం ఆయన హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నారు. టీబీ కార్యాలయానికి ప్రభుత్వం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ మంజూరు చేసింది. త్వరలోనే ఇన్‌స్టాలేషన్ చేయిస్తాం. ప్రస్తుతం రోగులను ఎక్స్‌రే కోసం రిమ్స్‌కు పంపిస్తున్నాం.

– సాయిప్రియ, టీబీ ప్రోగ్రాం అధికారి, ఆదిలాబాద్

ఆదిలాబాద్‌టౌన్: క్షయ(టీబీ) నిర్మూలన కోసం ప్రభుత్వాలు లక్షలు వెచ్చిస్తున్నా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. కొంతమంది వైద్యశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఎక్స్‌రే మిషన్‌ను టీబీ ఆస్పత్రికి పంపించింది. ఓ టెక్నీషియన్‌ను నియమించింది. ఇక్కడ ఉండి విధులు నిర్వర్తించాల్సిన ఆ ఉద్యోగి రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో తన సొంత జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. దీంతో నూతన ఎక్స్‌రే మిషన్ ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోకపోవడం గమనార్హం. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దుస్థితి.

ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం..

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో టీబీ ఆస్పత్రి ఉంది. క్షయ వ్యాధి నిర్ధారణ కోసం రోజుకు పదుల సంఖ్యలో రోగులు ఇక్కడికి వస్తుంటారు. గతంలో రిమ్స్‌లో ఈ పరీక్షలు చేస్తుండగా, రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం మూడేళ్ల క్రితం టీబీ ఆస్పత్రికి సుమారు రూ.30 లక్షలు వెచ్చించి నూతనంగా ఎక్స్‌రే మిషన్ పంపించింది. అయితే అధికారుల అలసత్వం కారణంగా ఆ యంత్రం కాస్తా మూలనపడగా, రోగులు గతంలోలాగే రిమ్స్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి. ఇక్కడ యంత్రం ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని తెలుస్తోంది. జిల్లాలో వేతనం తీసుకుంటూ ఇతర జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వైద్యారోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులందరి డిప్యూటేషన్లు రద్దయినప్పటికీ ఈయన మాత్రం హన్మకొండలోనే దర్జాగా విధులు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక్కడ రోగుల పరిస్థితి ఏమిటి..?

టీబీ ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్‌గా పనిచేసే ఉద్యోగి ఉన్నతాధికారులతో పైరవీలు చేసుకొని ఏడాది కాలంగా హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నట్లు ఆ కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్‌లో టీబీ కార్యాలయం నుంచి వేతనం తీసుకుంటున్న ఆయన ఇక్కడ లేకపోవడంతో ఆ యంత్రం పనిచేయకుండా పోతోంది. ఆ ఉద్యోగిని టీబీ కార్యాలయానికి కేటాయించడంతోనే ప్రభుత్వం లక్షల విలువైన యంత్రాన్ని మంజూరు చేసింది. తీరా ఆయన డిప్యూటేషన్‌పై ఆయన సొంత జిల్లాకు వెళ్లడంతో ఇక్కడి రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. రిమ్స్ ఆస్పత్రిలో టీబీ నిర్ధారణ కోసం రోజుకు 20 నుంచి 30 మంది వరకు వస్తున్నారు. వీరందరిని ఎక్స్‌రే తీయించేందుకు అధికారులు రిమ్స్‌కు పంపిస్తున్నారు. దీంతో అక్కడ రద్దీ పెరిగి రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది.

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో రాధే రాధే ప్రభాత్‌భేరీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం గోపాష్టమి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మార్వాడి మహిళలు, పురుషులు రాధాకృష్ణ భవన్ నుంచి భజనలు, కీర్తనలతో గోశాలకు వెళ్లి అక్కడ కృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 56 రకాల నైవేద్యాలను గోవులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో మున్నా లడ్డా, ప్రదీప్ లడ్డా, తదితరులు ఉన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మార్వాడి సంఘ సభ్యులు

విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి

నిర్మల్ రూరల్: క్రీడల్లో విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి వుషూ, కిక్ బాక్సింగ్ సెలక్షన్స్‌లో లోకేశ్వరం, భైంసా, కుభీర్ కేజీబీవీల విద్యార్థులు, బాసరలోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వారిని కలెక్టరేట్‌లో సోమవారం అభినందించారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి నఫీఖాన్, జీసీడీవో శ్రీదేవి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు, ట్రైనర్లు సాయికిరణ్, జితేందర్‌సింగ్, పీఈటీలు పాల్గొన్నారు.



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో కలెక్టర్

ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత

- ఇరువర్గాల మధ్య తోపులాట

కౌటాల(సిర్పూర్): కుమురంభీం జిల్లా కౌటాల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆయా పార్టీల నాయకులు రోడ్ షో నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి హరీష్‌బాబు రోడ్‌షో మార్కెట్ ఏరియా నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతానికి ముందుగా చేరుకుంది. అనంతరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప తనయుడు వంశీకృష్ణ రోడ్ షో అక్కడికి చేరుకుంది. ఇరుపార్టీల ప్రచార వాహనాల ఎదుట కార్యకర్తలు నృత్యం చేయడంతో బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఒక దశలో ఇరువర్గాల మధ్యలో తోపులాట జరిగింది. సీఐ సాధిక్ పాషా, ఎస్సైలు మధుకర్, వెంకటేశ్, విక్రమ్ ఇరువర్గాలను శాంతిపజేసే ప్రయత్నం చేశారు. పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నరని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం హరీశ్‌బాబు ప్రచార వాహనం అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఉద్రిక్తత చల్లారింది. పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారనే విమర్శలు వ్యక్తమయ్యాయి.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

టోంకిని ఆలయానికి పోటెత్తనున్న భక్తజనం

- కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వరకు మహాపాదయాత్ర
- వేలాదిగా తరలిరానున్న ప్రజలు



శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం

సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం టోంకినిలోని శ్రీసిద్ది టోంకిని హనుమాన్ ఆలయానికి మంగళవారం భక్తజనం పోటెత్తనున్నారు. ఏటా కార్తీకమాసం రెండో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా టోంకిని హనుమాన్ ఆలయం వరకు భక్తులు మహాపాదయాత్ర నిర్వహిస్తారు.

భక్తుల అపార నమ్మకం..

ఆలయంలో సిద్ధి హనుమాన్‌ను దర్శించుకుని ముడుపులు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల అపార నమ్మకం. దీంతో ఏటా కార్తీక మాసంలో కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కౌటాల, బెజ్జూర్ మండలాలు, మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర పట్టణాలైన వీరూర్, గోండ్‌పిప్రి, అహెరి పట్టణాలతో పాటు గ్రామాల నుంచి వేలాది భక్తులు పాదయాత్రగా తరలివస్తారు.

భారీ బందోబస్తు...

కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కౌటాల సీఐ సాదిక్ పాష, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సిర్పూర్(టి)–కాగజ్‌నగర్, సిర్పూర్(టి)–కౌటాల ప్రధాన రహదారులతో పాటు ఆలయ సమీపంలో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వంద మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్టు సభ్యుడు జాబోర్ మారుతి తెలిపారు.



ఆలయంలోని సిద్ధి హనుమాన్ విగ్రహం

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేష్ మాట్లాడుతూ ఫీజుల పేరుతో ప్రిన్సిపాల్ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫీజు చెల్లించకుంటే కళాశాలకు రావద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. అకారణంగా తొలగించిన లెక్చరర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికి ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు